

# నన్ను క్షమించవూ!

బి.పి.కరుణాకర్

ఉదయంనుండి కుండ పోతగా కురిసిన వర్షం సాయంత్రమయ్యేసరికి చప్పబడి పోయింది. చల్లటి ఈదురు గాలి కొట్టసాగింది. నేల తడిసి అదోరకమ్మైన వాసన వేస్తుంది.

సత్యం గదిలో కూర్చున్నాడు. తెరచివున్న కిటికీలో గుండా చల్లటి గాలి గదిలోకి వీస్తుంది గదిలో గోడకు వున్న రాధామాధవుల క్యాలండర్ గోడకు గీసుకుంటుంది అలా గీసుకుంటున్నప్పుడు అదోరకమ్మైన సంగీతం వినిపిస్తుంది. ఆ క్యాలండర్ను చాలా సేపటి వరకు చూస్తుండిపోయాడు.

మనసులో ఆలోచనలు ముసురుకుంటున్నాయి. నిర్మల, అమ్మ, పాప, కృష్ణుడు వీళ్లంతా గుర్తుకు వస్తున్నారు. ఆలోచనలన్నీ కృష్ణుడు మీద కేంద్రీకరించాయి. కృష్ణుడు సత్యం తమ్ముడు. 'ఎలా చదువుకుంటున్నాడోవాడు' అనుకున్నాడు ఈ సంవత్సరం కృష్ణుడు స్కూలు ఫైనల్ పాసయితే తమకుటుంబ కష్టాలు తగ్గుతాయి. కాని వాడు చదవడు. ఇంటి పరిస్థితులు అర్థంకావు వాడికి. తను ఎన్నోసార్లు విడమర్చి చెప్పుదామనుకున్నాడు. చెప్పలేక పోయాడు. ఇంకా చిన్నతనం అనుకుని సరిపుచ్చాడు సత్యం

జేబులోంచి ఉత్తరం తీసాడు. అమ్మ రాసిన అక్షరాలు వంకర టింకరగా వున్నాయి. "కృష్ణుడు చదవమంటే చదవడు నేను చెప్పిన మాట వినిపించుకోడు. నీవు వీలుచూచుకుని ఒకసారి వచ్చి వాడిని మందలిస్తే బావుంటుందేమో. పాప క్షేమంగావుంది. పరీక్షలలో మార్కులు బాగానే వచ్చాయి. దానికి. నా దగ్గు ఇంకా తగ్గలేదు. ఆచార్యుల మందు [illegible]

నీళ్ళ కన్నా అధ్వానంగా వుంటోంది. రామిరెడ్డి నోటు తీసుకువచ్చి తన బాకీ యివ్వలేదని నానా రభస చేస్తున్నాడు. నన్నేం చేయమంటావు?" అంతవరకూ చదివి బల్ల మీద పెట్టాడు.

నాన్నగారు ఉండేప్పుడు ఇంట్లో వాళ్ళు తనను చదివించలేక ఎంతకష్టపడేది తనకు తెలిసేదికాదు. జీవితమంతా బాధ్యతలు లేకుండా గడచిపోతుందన్న ఆలోచనలో చుట్టుకుపోయాడు తను. తనకిప్పుడు తెలిసివస్తుంది. బాధ్యత అంటే ఏమిటో. ప్చ్! తప్పదు— అనుకున్నాడు సత్యం.

దూరంగా చర్చిలో ఆగి ఆగి గంటలు కొడుతున్నారు.

చల్లటిగాలి దారిద్ర్యంలో రివ్వులు మట్టు కుంటుంది.

మధ్యాహ్నం భోజనం చేయలేదు. ఆకలి వేస్తున్నది. కుండలో మంచి నీళ్ళు ముంచుకుని కడుపు నిండా తాగాడు.

తలుపు దగ్గర చప్పుడైంది. సత్యం గుండెల్లో గుబులు అల్లుకుంది. ఇల్లుగలాయన వస్తాడు. 'అద్దె అద్దె' అంటాడు. పూర్వకాలం కథల్లో రాక్షసులు 'నరమాంసం నరమాంసం' అన్నట్టు. 'వచ్చే నెల' అనే ఆయుధం పని అయిపోయింది. ఏదో వినయంగా చెప్పాలి. ఈచాలీ చాలని గొర్రె తోకలాటి దరిద్ర జీ(వి)తంతో తను బ్రతకాలి. తనకోసం కాక పోయినా తనవారికోసం బ్రతకాలి. ఇవన్నీ అనుభవించక తప్పదు.

తిరిగి తలుపు చప్పుడైంది. తలుపు మీద చప్పుడు సత్యం గుండెలకు తాకుతుంది తలుపువైపు నడిచాడు. ఇల్లు గలాయనకు ఏంచెప్పాలి?. ఈనెల అమ్మకు డబ్బు పంపకపోతే తను పిడికి సర్దేసేవాడే—కాని తప్పదు. తలుపు తీసాడు.

ఎదురుగా నిర్మల నుంచునిఉంది.

"మీరా?" అన్నాడు.

నిర్మల బుగ్గలు ఎరుపెక్కుతున్నాయి. వెంటనే కోపం పులుముకుంది.

"ఆశ్చర్యపోతున్నారా?" అడిగింది నిర్మల.

సత్యం తలుపుకు అడ్డంగా తొలగి "రండి" అన్నాడు.

నిర్మల లోపలకు నడిచింది.

"ఎలా వున్నారు?"

నిర్మల వ్యంగ్యగా నవ్వింది.

"మీదయవల్ల బాగానే వున్నాము"

సత్యం బాధగా నవ్వాడు.

"కూర్చోండి" కుర్చీ చూపించాడు.

నిర్మల కూర్చో లేదు.

"నాయింట్లో కూర్చోకూడదను కున్నారా?"

"అసలు మీదగ్గరకే రాకూడదనుకున్నాను."

"నామీద కోపం వచ్చిందా?"

నిర్మల పెదాలు వణుకు తున్నాయి.

"ఎందుకు?"

"నేను మీయింటికి రాలేదని"

"మీకు తీరిక ఎక్కడుంటుంది స్వామీ"

"కాదు నిర్మలా. ఆఫీసులో...."

"మీరు నాకేం చెప్పనవసరం లేదు."

సత్యం రెండు క్షణాలు కిటికీలోంచి [illegible]

మనసులు అల్లాడుతున్నాయి. అడుకునే బిచ్చం గోల. రిక్షా చప్పుడు. ఇల్లుగలాయన ఎవరితోనో పోట్లాడుతున్నాడు. ఆయన ఎవరితో నైనా మాట్లాడుతుంటే పోట్లాటలా వుంటుంది.

నిర్మల దగ్గరకు వచ్చి "నన్ను కొట్టు" చెంత అందించాడు సత్యం.

"మీకోసం, మీరాకకోసం తపించే ఒక జీవి వుందని మీ కార్యకలాపాల్లో ఎందుకు గుర్తుంటుంది?"

సత్యం మాట్లాడ లేదు. తలవంచుకుని నుంచున్నాడు.

"నన్నెందుకిలా హింసిస్తారు?"

నిర్మల కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. సత్యం తలెత్తి బాధగా చూసాడు. "అదికాదు" అనబోయాడు. నిర్మల తల వంచుకుని క్రిందకు చూస్తూ నేలమీద కాలి బొటన వ్రేలితో పిచ్చి గీతలు గీయసాగింది.

"నన్ను క్షమించు" అన్నాడు.

"ఎందుకు నన్నిలా బాధ పెడ్తారు? నన్నిలా బాధ పెట్టినందువలన మీకు కలిగే లాభం ఏమిటి? నన్నిలా బాధించే బదులు ఒకసారి నాగొంతు నులిమి చంపెయ్య కూడదూ".

"నిర్మలా" బాధగా అన్నాడు సత్యం.

"మీదృష్టిలో మా నాన్నగారి అంతస్తూ— ఐశ్వర్యమే కనిపిస్తుంది. నేను కనిపించను. నాకు మానాన్నగారి ఐశ్వర్యం వద్దు. అంతస్తు అంత కన్నావద్దు. మీరు కావాలి. మీరేమో ఇన్ ఫీరియారిటి కాంప్లెక్సుతో చుట్టుకు పోతారు. నన్ను ఎవర్నో కొత్తవాళ్లను చూస్తున్నట్లు...." నిర్మల గొంతు గాద్గదికమైంది. రెండుచేతులతో ముఖం కప్పుకుని ఏడవసాగింది.

సత్యం నిర్మల గడ్డం పట్టుకుని లేపాడు. "నువ్వింత బాధ పడ్తావని నేనను కోలేదు. ఈ చిన్న పొరపాటుకు నన్ను క్షమించు."అన్నాడు నిర్మల కంటనీరు తుడుస్తూ

"మరి రేపు సాయంత్రం రావాలి" అన్నది నిర్మల.

"ఎక్కడికి?"

"మాయింటికి"

"ఎందుకు?"

"రేపు వచ్చాక చెప్తాను. ముందు ప్రమాణం చేయండి రేపువస్తానని"

చేయి చాపింది. సత్యం నిర్మల చేతిలో చేయి వేశాడు.

"తప్పక" అన్నాడు.

"మాట తప్పకూడదు"

"ఆ.హ"

"కూర్చో కాఫీ కాచి యిస్తాను"

మీరు కూర్చోండి నే తయారు చేస్తాను. నిర్మల జరీ అంచు కొంగు బిగించింది.

"పాలు లేవు"

"డికాషనే తాగుదాం"

"సరే"

నిర్మల స్టౌ వెలిగించింది. సత్యం బల్లకు ఆనుకుని నుంచున్నాడు. నిర్మల గిన్నెలో నీళ్ళు పోసి స్టౌ మీద పెట్టింది. తిరిగి [illegible] మానాన్న గారు అడిగారు" అన్నది.

"ఏమని?"

"నా పెళ్ళి విషయం"

"ఏమని చెప్పావు?"

"ఇంకా ఏమీ చెప్పలేదు. అందుకే రేపు మీరు మాయింటికి రండి. ఈసారి ఆ విషయం చెప్పేస్తాను."

సత్యం ఆలోచనలన్నీ ఒక్కసారిగా ఆగిపోయాయి. నిర్మల దగ్గరకు చేరాలంటే ఎన్నో మెట్లు ఎక్కాలి— ఓ పెద్ద కొండమీదున్న పువ్వువి నువ్వు. అన్నిమెట్లు ఎక్కి నిన్ను అందుకునే స్తోమత నాకు లేదు— అనుకున్నాడు సత్యం.

రెండో రోజు సాయంత్రం నిర్మల సత్యం కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. ఇంట్లో ఎవరూలేరు. నాన్నగారు క్లబ్ నుండి యింకా రాలేదు. అమ్మ దేవాలయానికి వెళ్ళింది. వచ్చే సమయమైంది. సత్యం రాలేదు. గేటు దగ్గర ఏచిన్న శబ్దమైనా 'సత్యం' అని పలుకుతుంది. నిర్మల హృదయం. గేటు దగ్గర చప్పుడైంది. గన్నేరు చెట్టుమీద పక్షుల గోల వింతగా వుంది. వెనక్కు తిరిగింది. స్నేహితురాలు సరోజిని వస్తుంది. ఆసమయంలో సరోజిని రావడం కష్టమనిపించింది నిర్మలకు. సరోజిని నిర్మల ఎదురుగా కూర్చుని, "నీతో ఒక విషయం మాట్లాడాలి" అన్నది.

"ఏమిటే?"

సరోజిని రెండు క్షణాలు తటపటాయించింది.

"ఏమిటే విషయం?"

"నాకెలా చెప్పాలో తెలియడంలేదు" అని తిరిగి రెండు క్షణాలు నిర్మల ముఖంలోకి చూసింది సరోజిని." నీకు సత్యం తెలుసా?"

సత్యం పేరు వినగానే నిర్మల కళ్ళు విచిత్రంగా మెరిసాయి తలూపింది.

"సత్యం."అని ఆగి పోయింది సరోజిని.

నిర్మల గుండె ఒక్కసారి ఆగిపోయి నట్లనిపించింది. సత్యానికేమైంది అని ఆత్రుతగా అడుగుదామనిపించింది. కాని అడగ లేకపోయింది.

"సత్యం గూర్చి నీ అభిప్రాయం ఏమిటి?

"తెలియదు"

"నీకు తెలుసుగదా అతను."

"కావచ్చు. అతని గురించి అంతగా తెలియదు" తప్పించుకుంది నిర్మల.

"నేనడిగేదేమిటంటే అతని గురించి నీ ఉద్దేశం ఏమిటని"

సిగ్గు దొంతరలలో నిర్మల హృదయం చుట్టుకుపోతూంది.

"అంటే?"

"ఎలాటి వాడు?"

అందంగా వుంటాడు మంచివాడు అందామను కుంది నిర్మల.

"మంచి వాడేనా?"

తలూపింది.

"సత్యాన్ని పెళ్లి చేసుకునే స్త్రీ అదృష్టవంతురాలనుకో వచ్చా?"

"ఏమో"

"అదికాదు. నువ్వేమనుకుంటావు?"

[illegible]

నౌకర్యం కావటం లేదు."

"మాయింటికి వస్తుంటాడు కదా అతని సంగతి నీకు కొంత తెలిసి ఉండవచ్చు కదా అన్న ఉద్దేశంతో అడుగుతున్నాను."

"నాకేమీ తెలియదు." ముక్తాయించింది నిర్మల.

"అసలు సంగతి చెప్తాను విను"

నిర్మల ముందుకు జరిగింది.

"సత్యం నేనూ పెళ్ళి చేసుకో బోతున్నాం" అన్నది సరోజిని.

తనమీద పిడుగు పడ్డట్లనిపించింది నిర్మలకు. ఆ క్షణంలో తన కాలి క్రిందవున్న భూమి పగిలి పోయి తనెక్కడికో దూరతీరాలకు జారిపోతున్నట్లనిపించింది. పెద్ద మేడ వెనక్కు కప్పేరు చెట్టు కొమ్మల మీదుగా ఎర్రగా యింకి పోతున్నాడు సూర్యుడు. సరోజిని ఒక్కొక్కటే వివరిస్తుంది. సత్యం తనను ఎలా ప్రేమిస్తున్నదీ. తను సత్యానికి ఎలా ఎంత దగ్గరగా చేరువైనదీ అన్నీ వివరిస్తుంది సరోజిని. తనదగ్గరున్న పుస్తకం తీసి అందులో వున్న సత్యం ఫోటో సత్యం తనకు రాసిన ఉత్తరాలు తీసింది సరోజిని. నిర్మల వ్రాత పరీక్షించింది. తను పొరబడటం లేదు. అది సత్యం చేతి వ్రాతే.

"చదువుతాను విను" అన్నది సరోజిని.

సరోజిని ఒక్కొక్క ఉత్తరాన్ని చదవ సాగింది. నిర్మలకు వినాలని అనిపించ లేదు. తన హృదయంలో దీపాన్ని ఎవరో ఆర్పేసినట్లు అనిపించింది. ఆరిపోయిన వత్తి నుండి సన్నగా దట్టంగా పొగలు వస్తున్నాయి. 'దరిద్రులు తమ ఆలోచన పరిధినుండి దాటరు ఛీ' అనుకుంది నిర్మల సత్యాన్ని ఉద్దేశించి.

సరోజిని ఉత్తరాలు చదవడం ముగించి "ఏమిటి నీ ఉద్దేశం?" అడిగింది.

నిర్మల జవాబు చెప్పలేదు. అలాగే కళ్ళప్పగించి బైటకు చూస్తుండి పోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. బైటవస్తువులు తడిగా మసకగా కనిపించ సాగాయి. కళ్ళు గట్టిగా మూసుకుంది. సరోజిని వెళ్ళి పోయాక రెండు చేతులతో ముఖం కప్పుకొని ఏడుస్తూ వుండి పోయింది.

రెండురోజుల తర్వాత నిర్మల నాన్నగారు నిర్మల దగ్గరకు వచ్చి "తాహసిల్దార్ గారి పెద్దబ్బాయి సోమయాజులు నీ వంటే యిష్టపడ్డాడట. ముహూర్తం పెట్టించమని వ్రాశారు. ఏమిటి నీ ఉద్దేశం?" అడిగారు.

నిర్మల తన హృదయపూర్వక సమ్మతిని తెలిపింది. ఆమెలో ఇప్పుడెటువంటి భావం లేదు. తుపాను తర్వాతి వాతావరణంలాటి ప్రశాంతితో మునిగి పోయింది నిర్మల హృదయం. గడిచినదంతా పీడ కలలా అనిపించింది నిర్మలకు.

ఇదంతా పాతకథ.

ఆ కథ జరిగాక చరిత్రలో నాలుగు సంవత్సరాలు ఇంకి పోయాయి.

అమరపురాని సాయంత్రంలాటి మరోసాయంత్రం—

గంట కొట్టారు. గార్డు విజిల్‌నూది పచ్చ జెండా వూపు తున్నాడు.

# నన్ను క్షమించవూ!

"ఇంటికి చేరగానే ఉత్తరం వ్రాస్తావు కదూ" అడిగాడు సోమయాజులు.

నిర్మల తలూపింది.

"నీ ఆరోగ్యం జాగ్రత్త"

సోమయాజులు నవ్వాడు.

రైలు కూత కూసి కదిలింది.

"మర్చి పోవద్దు. ఉత్తరం రాయి"

"తప్పక"

"అందరినీ అడిగానని చెప్పు"

సోమయాజులు చేయి ప్లాట్ ఫారమ్ మీద గాలిలో వూగుతుంది. భర్త కనుమరుగయ్యే వరకు అటే చూస్తుండి పోయింది నిర్మల.

చెట్లూ చేమలూ వెనక్కు పరుగెడు తున్నాయి. ఊరి చివరనున్న లెవల్ క్రాసింగూ, ట్రావెలర్స్ బంగళా దగ్గరకు వచ్చి, వెనక్కు వెళ్ళి పోతున్నాయి. ఇంజన్ పొగలు నల్లగా దట్టంగా ఉన్నాయి. కంట్లో నలక పడింది. తల తిప్పి చేతి రుమాలుతో నలక తీసుకుంది నిర్మల. తన ఎదురుగా ఎవరో తననే చూస్తుండటం గమనించింది. ఆమెను ఎక్కడో చూసినట్లు గుర్తు.

"నేను గుర్తున్నానా ?" అడిగిందామె.

నిర్మల ఆమెను గుర్తు పట్టింది. "నువ్వు సరోజినివి కదూ."

సరోజిని నిండుగా నవ్వి, తలూపింది. సరోజిని మునుపటి కన్న కాస్త లావెక్కింది.

"చాల మారిపోయావు"

"నీవుకూడా" అన్నది సరోజిని.

ఆ తర్వాత వాళ్ళిద్దరికీ సంభాషణ చాల జరిగింది. అదంతా ఇక్కడ అనవసర మనుకుంటాను.

ఏలూరు స్టేషన్ దగ్గరవుతుండగా తనలో వేధిస్తున్న ఒక్క ప్రశ్నను దాచుకోలేక పోయింది నిర్మల.

" మీవారి పేరేమిటి?" అడిగింది నిర్మల. సరోజిని సత్యం అంటుంది అనుకుంది నిర్మల. సరోజిని చెప్పింది. నిర్మల ఉలిక్కి పడింది.

"సత్యాన్ని చేసుకుంటానన్నావుకదా" అన్నది నిర్మల.




సరోజిని ముఖంలో రంగులు మారాయి.

"లేదు. అదంతా నాటకం. నువ్వు నన్ను క్షమిస్తానంటే ఒక్క విషయం చెప్తానని వుంది" అన్నది సరోజిని.

"ఏమిటి?"

"ముందు నన్ను క్షమించానను."

"ముందు చెప్పు."

సరోజిని మాటలు చాల భారంగా వచ్చాయి. నే నోసాయంత్రం నీదగ్గరకు వచ్చాను. అంతా చెప్పాను గుర్తుందా?" ఆగి నిర్మల కళ్ళల్లోకి చూసింది.

నిర్మల తలూపింది.

"అంతా నాటకం"

తన వీపు మీద ఎవరో పెద్దగా చరచి నట్లనిపించింది నిర్మలకు :

"అంటే"

"అంతా నాటకం. రోజూ నా దగ్గరకు వచ్చేవాడు. సత్యం నన్నెప్పుడూ పాపా అని పిలిచేవాడు. పాప సత్యం చెల్లెలు. నేను వాళ్ళ పాపలా వుంటానట. అందుకనే నన్నలా పిలిచేవాడు. "పాపా!" నాకు నోచిన్న సహాయం చేసి పెట్టాలి" అన్నాడు. ఏమి టన్నాను. నువ్వు నిర్మల దగ్గరకు వెళ్ళా లన్నాడు. దేనికన్నాను. కథంతా చెప్పాడు.. కాదన్నాను. బ్రతిమిలాడాడు. "నిర్మలంటే నాకూ ప్రాణం పాపా కాని నన్ను చేసుకుని నిర్మలసుఖ పడలేదు" అన్నాడు ఏడుస్తూ. 'నువ్వు అలా నటించు. నాకంతకంటే ఏమీవద్దు. నాకోరిక మన్నించ' మన్నాడు. సత్యం కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. కాదన లేకపోయాను. అప్పటికప్పుడు నాలుగు ఉత్తరాలు వ్రాసియిచ్చాడు. నేను నీదగ్గర ఎలా నటించాలో చెప్పాడు. నీ దగ్గరకు వచ్చాను. నిజానికి అంతా నాటకం.' ఈ మాటలు సరోజిని చెప్తుంటే నిర్మల హృదయం చలించింది. సరోజిని కళ్ళల్లో నీరు తిరుగుతున్నాయి. ఆ క్షణంలో నిర్మలకు బోరున ఏడుద్దామని పించింది.

ఏలూరు వచ్చే వరకూ సరోజిని "నన్ను క్షమించవూ" అని నిర్మలను అడుగుతూనే ఉంది.

ఏలూరు స్టేషన్‌లో రైలు ఆగింది.

సరోజిని లేచి తన సామాను సర్దుకోసాగింది.

"దిగిపోతున్నావా ?"

సరోజిని తలూపింది.

నిర్మలకు సత్యాన్ని గురించి ఎన్నో అడగాలని వుంది. గుండెల్లో అదోరకమైన బాధ. వ్యక్తం కాని అనురాగం పెరికార్డియమ్ దాటి బైటకు రావడంలేదు.

స్టేషన్‌లో గంట కొట్టారు.

సరోజిని ప్లాటుఫారంమీద నుంచుంది.

"మనం అనుకోకుండా కలిసాం కదూ."

సరోజిని తలూపింది.

"మళ్ళీ ఎప్పుడు కలుసుకుంటామో."

"ఏమో."

"సత్యం ఎక్కడ ఉంటున్నాడు ?"

"మంగళగిరిలో."

"ఏం చేస్తున్నాడు ?"

సరోజిని రెండు క్షణాలు తటపటాయించింది.

"నీ కెప్పుడేనా కన్పించాడా ?"

సరోజిని తలూపింది.

"ఎక్కడేమిటి ?"

"విజయవాడ స్టేషన్లో"

"ఎలా ఉన్నాడు ?"

"చిక్కిపోయాడు."

"నాగురించి అడిగాడా ?"

"అతను మాట్లాడే ప్రతి నాలుగు మాటలలో మూడు మాటలు నీ విషయం మాట్లాడుతాడు."

నిర్మల బాధగా నవ్వింది. కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

రైలు కదిలింది.

"మంగళగిరిలో ఏం చేస్తున్నాడు ?"


సరోజిని ఏదో అంది.

నిర్మల వినటందుకు వంగింది.

"శానిటోరియమ్‌లో ఉన్నాడు."

సరోజిని చాల బాధగా అంది.

ఆ క్షణంలో నిర్మలకు కాలం స్తంభించిపోయినట్లనిపించింది. తను నాలుగు సంవత్సరాలు వెనక్కు పరుగెత్తలేదు. ★




CSTH-2 A TEL